సాక్షి
పెద్దపల్లి

శనివారం । 21 । అక్టోబర్ । 2023

ఆడిపాడి..



కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రాత్రి నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందించారు. కమిషనర్ నాగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్, ఎస్ఈ చిన్నరావు, ఈఈ సుచరణ్ పాల్గొన్నారు.

సద్దులకు రెడీ



జిల్లాలో సద్దుల బతుకమ్మ సంబురాలు చేసుకునేందుకు ఆడపడుచులు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ఈక్రమంలోనే పెద్దపల్లిలో రంగులు, వివిధ రకాల పూల కొనుగోలు కోసం ఇలా బారులు తీరారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

అందరికీ అభయ హస్తం

- ఉమ్మడి జిల్లాలో ముగిసిన విజయభేరి యాత్ర
- కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం
- అధిక సంఖ్యలో హాజరైన కార్యకర్తలు, ప్రజలు
- జీవన్‌రెడ్డిని అభినందించిన రాహుల్



జగిత్యాలకు చేరుకుని ప్రజలకు అభివాదం చేస్తున్న కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ

సాక్షిప్రతినిధి,కరీంనగర్/జగిత్యాల/కొత్తపల్లి/మల్యాల: రాహుల్‌గాంధీ విజయభేరి యాత్ర కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. పెద్దపల్లి జిల్లాలో గురువారం మంథని వద్ద ప్రవేశించిన రాహుల్‌గాంధీ యాత్ర.. శుక్రవారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మీదుగా నిజామాబాద్ జిల్లాలో ప్రవేశించింది. కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరిస్తూ.. బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం విధానాలను ఎండగడుతూ రాహుల్‌గాంధీ ముందుకుసాగారు. కాంగ్రెస్ కార్యకర్తలను బెబ్బులితో పోలుస్తూ ఉత్సాహం నింపారు. అత్యవసర పనులు ఉండడంతో గంగాధర కార్నర్‌మీటింగ్, కొండగట్టు దర్శనం రద్దయ్యాయి. అయినా.. ఆయా ప్రాంతాల్లో ఎదురుచూస్తున్న స్థానికులను, పార్టీ కార్యకర్తలను పలకరిస్తూ ముందుకుసాగారు.

దోశ వేసిన రాహుల్‌గాంధీ

జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాజారం, నూకపల్లి న్యాక్ బస్టాండ్ వద్ద మొబైల్ టిఫిన్ సెంటర్‌లో రాహుల్‌గాంధీ దోశ వేశారు. దోశ తింటూ స్థానికులతో ముచ్చటించారు. దంపతులను మాట్లాడించి, వారి పిల్లలకు చాక్లెట్స్ ఇచ్చా రు. గౌడసంఘం నాయకులు మోకు అందజేశా రు. జగిత్యాల కొత్తబస్టాండ్‌కు చేరుకోగా.. అప్పటికే అక్కడికి భారీగా వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు.. 'రాహుల్ పీఎం..' అంటూ నినాదాలు చేశారు. బస్సు ఎక్కిన రాహుల్‌గాంధీ దాదాపు 36 నిమిషాలపాటు ప్రసంగించారు. జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి జీవన్‌రెడ్డిని, ధర్మపురి ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తన ప్రసంగాన్ని తెలుగులో బాగా అనువదించారని జీవన్‌రెడ్డిని రాహుల్‌గాంధీ అభినందించారు. రాహుల్ వెంట టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, నాయకులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మధుయాష్కీగౌడ్, శ్రీధర్‌బాబు, మాణిక్ రావుఠాక్రే, వేణుగోపాల్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

జగిత్యాల నుంచి కోరుట్ల వైపు..

రాహుల్‌కు మేడిపల్లిలో వేములవాడ నియోజకవర్గ అభ్యర్థి ఆది శ్రీనివాస్ వేములవాడ రాజన్న ప్రసాదం అందించారు. కోరుట్లలో భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు నర్సింగారావు, కోమటిరెడ్డి కరంచంద్, కృష్ణారావు, సుజిత్‌రావు స్వాగతం పలికారు. కోరుట్ల శివారులోని ముక్క కన్వెన్షన్ సెంటర్‌లో భోజనం చేసి మెట్‌పల్లికి వెళ్లారు. కారులో నుంచే ప్రజలకు అభివాదం చేస్తూ ఆర్మూర్ బయలుదేరి వెళ్లారు.

దొంగల బెడద

యాత్రలో కార్యకర్తలకు దొంగల బెడద వెంటాడింది. జగిత్యాలతోపాటు మేడిపల్లిలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. జగిత్యాల కొత్తబస్టాండ్‌లో భారీ సంఖ్యలో ప్రజలు గుమిగూడడంతో దొంగలు చేతివాటం ప్రదర్శించారు.

హోటల్ వద్ద సందడి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లో గురువారం రాత్రి రాహుల్‌గాంధీ స్థానిక హోటల్ -వీ పార్క్‌లో బసచేశారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ కార్యకర్తలు, నాయకులు శుక్రవారం ఉదయం భారీగా హోటల్ వద్దకు చేరుకున్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు సైతం రావడంతో పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్, మాణిక్‌రావుఠాక్రే, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, మధుయాష్కీ హోటల్‌లోనే బసచేశారు. రాహుల్‌ను కలిసేందుకు ఉదయమే ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, రాజయ్య, మాజీ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వంశీచందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణతోపాటు స్థానిక నాయకులు హోటల్ వద్దకు వచ్చారు. తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరాంతో రాహుల్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

'సేవ్ కాంగ్రెస్..సేవ్ చెన్నూర్' అంటూ..

హోటల్ ఎదుట చెన్నూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు ప్లకార్డులు ప్రదర్శించారు. 'రాహుల్ గాంధీకి జై.. సేవ్ కాంగ్రెస్..సేవ్ చెన్నూర్'.. అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. గమనించిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు వారికి నచ్చజెప్పారు.

సెంచరీ కొడతాం

అసెంబ్లీ ఎన్నికల్లో సెంచరీ కొట్టి అధికారంలోకి వస్తామని నల్గొండ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ బస చేసిన కరీంనగర్‌లోని హోటల్ వీ-పార్క్ వద్దకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పని అయిపోయిందని, ప్రజలు వారిని తిరస్కరించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఉచిత విద్యుత్ ఘనత కాంగ్రెస్‌దే

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఎమ్మెల్సీ, జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల కార్నర్ మీటింగ్‌లో ముందుగా జీవన్‌రెడ్డి మాట్లాడారు. నిరుద్యోగులు ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



జగిత్యాలలో బైక్‌పై వస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మల్యాల వద్ద దోశ తింటూ.. ముచ్చటిస్తూ..



జగిత్యాలలో జరిగిన కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం



రాహుల్ గాంధీకి మోకు అందించిన గౌడన్న



కోరుట్లలో రాహుల్ రాకకోసం..

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

- ఈవీఎంలపై అపోహలు వద్దు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి శుక్రవారం ఎన్నికల అధికారులతో సమావేశమయ్యారు. పోలింగ్ సందర్భంగా అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. పోలింగ్‌కేంద్రాలో ఓటరు గోప్యంగా ఓటుహక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

ఈవీఎంలపై అపోహలు తొలగించేందుకే..

ఈవీఎంలపై అపోహలు తొలగించేందుకే రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. తొలిదశలో ఈవీఎంలను నియోజకవర్గాల వారీగా కేటాయించామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడే అన్నిచర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు రాజకీయపార్టీలు సహకరించాలని కోరారు. సభలు, సమావేశాలకు అనుమతులు పొందాలని సూచించారు. ఆర్డీవోలు మధుమోహన్, హనుమానాయక్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వజ్రాయుధమే



ర్యాలీ ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ

జంగ్ తెలంగాణ

కోల్‌సిటీ: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధమని అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి గోదావరిఖని చౌరస్తా వరకు చేపట్టిన ర్యాలీని శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. 18ఏళ్ల వయసు నిండిన ప్రతిఒక్కరూ జాబితాలో ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కోరారు. నీతిగా, నిజాయతీగా ఓటుహక్కు వినియోగించడంతోపాటు ఇతరులు కూడా వినియోగించుకునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రలోభాలకు లొంగకుండా కచ్చితంగా ఓటుహక్కు వినియోగించుకుంటామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ నాగేశ్వర్, స్వీప్ నోడల్ ఆఫీసర్ రవూఫ్ ఖాన్, డీఆర్డీవో శ్రీధర్, డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, ఎస్ఈ చిన్నారావు, సూపరింటెండెంట్ మనోహర్, మెప్మా పీడీ (అర్బన్) రజని, ఐసీడీఎస్ సీడీపీవో స్వరూప, రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాల తహసీల్దార్లు, అంగన్‌వాడీ, మెప్మా సీవోలు, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మధ్యే ఉన్నా.. ఒక్కఫోన్‌కాల్‌కు స్పందిస్తా

- ప్రజా ఆశీర్వాద యాత్రలో మంత్రి కొప్పుల ఈశ్వర్



మంత్రికి బొట్టు పెడుతున్న మహిళలు

ధర్మారం: 'ప్రజల మధ్యే ఉన్నా.. ఒక్కఫోన్‌కాల్ చేసినా స్పందించి సమస్యలు పరిష్కరించా.. మరో ఐదేళ్లు ఇలాగే సేవ చేసుకునే అవకాశం కల్పించాలి' అని మంత్రి కొప్పుల ఈశ్వర్ కోరారు. దొంగతుర్తి, నర్సింహులపల్లి, బుచ్చయ్యపల్లి, బొట్లవనపర్తిలో శుక్రవారం నిర్వహించిన ప్రజాఆశీర్వాద యాత్రలో ఆయన మాట్లాడారు. సామాన్యులు అనారోగ్యానికి గురైతే.. తాను అందుబాటులో లేకున్నా.. తన వ్యక్తిగత సహాయకులతో వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకున్నానని గుర్తుచేశారు. సీఎం సహాయనిధి ద్వారా రూ.82 కోట్ల సాయం మంజూరు చేయించానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఒక్కఓటు వేస్తే ఐదేళ్లు సేవచేస్తానని అన్నారు. ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ, సహకారసంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు బలరాం రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి, వైస్ చైర్మన్ చొప్పరి చంద్రయ్య, సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు పుస్కూరి రామారావు, మండల అధ్యక్షుడు పాకాల రాజయ్య, పార్టీ అధ్యక్షుడు రాసూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నల్లా బిల్లులపై వివరణ

సాక్షి స్పందన

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలో నల్లా బిల్లులు అప్‌డేట్ కాకపోవడంపై ఈనెల 9న 'నల్లాబిల్లు.. అప్‌డేట్ నిల్లు' శీర్షికను 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై అదనపు కలెక్టర్ అరుణశ్రీ స్పందించారు. వినియోగదారులు చెల్లించిన బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయకపోవడంపై మూడురోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్ ప్రత్యేకంగా వివరణ ఇచ్చారు. బిల్లులను అప్‌డేట్ చేయడానికి సీజీజీ లింక్ ఇవ్వకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయని, అందుకే మాన్యువల్‌గా రసీదులు ఇస్తున్నామని వివరించారు. ఈ సమస్యను సీడీఎంఏ దృష్టికి తీసుకుపోయినట్లు తెలిపారు. సీజీజీ లింక్‌తోపాటు పాస్‌వర్డ్, ఐడీ ఇవ్వాలన లేఖ రాసినట్లు ఆయన వివరణ ఇచ్చారు.

'మిల్లు నిర్మాణం ఆపండి'



సముదాయిస్తున్న ఎస్సై మహేందర్

పెద్దపల్లిరూరల్: కాలుష్యాన్ని వెదజల్లి ప్రజలకు వ్యాధులు అంటగట్టే రైస్‌మిల్లును ఇళ్ల మధ్య నిర్మించుకునేందుకు ఎలా అనుమతిస్తారని నిట్టూరు గ్రామస్తులు ప్రశ్నించారు. రోడ్డుపై శుక్రవారం బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై మహేందర్ సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

కాంగ్రెస్ తీరే కారణం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: కాంగ్రెస్ అవినీతి, అక్రమాలతోనే బొగ్గు బ్లాకులు ప్రైవేట్‌పరం అయ్యాయని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. శుక్రవారం జీడీకే-2 గని, స్థానిక 13, 33 డివిజన్లలో ప్రజాఅంకిత యాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ తమ అనుయాయులకు నిబంధనలకు విరుద్ధంగా బొగ్గు బ్లాకులను కేటాయించడంతోనే బీజేపీ ప్రభుత్వం 2014లో ఎంఎండీఆర్ యాక్ట్ తీసుకొచ్చిందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలను ఓడించాలని ఆయన కోరారు. వారసత్వ ఉద్యోగ హక్కును కారుణ్య నియామకాల పేరుతో సీఎం కేసీఆర్ పునరుద్ధరించారన్నారు. నాయకులు కెంగర్ల మల్లయ్య, కనకం శ్యాంసన్, వడ్డేపల్లి శంకర్, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలప్పుడు వచ్చేనాయకున్ని కాదు

ఎన్నికలప్పుడు వచ్చే నాయకున్ని కాదని, నిరంతరంలో ప్రజల్లో ఉంటానని ఎమ్మెల్యే చందర్ అన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా బీఆర్‌ఎస్ మేనిఫెస్టో ఉందన్నారు. సాధారణ ఉద్యమకారుడినైన తనను సీఎం కేసీఆర్ ఆదరించి, ఆశీస్సులు అందించారని గుర్తుచేశారు. హైదరాబాదీకీ ప్రజలు తగిన బుద్ధిని చెప్పాలని చందర్ కోరారు. కార్పొరేషన్ మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్ రాకం లత, నాయకులు దొంత శ్రీనివాస్, చెరుకు బుచ్చిరెడ్డి, నారాయణదాసు మారుతి, మాదాసు రామమూర్తి, దీటి బాలరాజ్, జాహిద్‌పాషా తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎల్కలపల్లికి చెందిన ఆడెపు శంకర్ బీఆర్‌ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రాహుల్ ఉపన్యాసం అయోమయం

- బీఆర్‌ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు



మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని: బస్సుయాత్రలో కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ చేసిన ఉపన్యాయం ప్రజలను అయోమయానికి గురచేసిందని, రాహుల్ గాంధీ ఏం చెప్పారో.. ట్రాన్స్‌లేటర్ ఏం చెబుతున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొందని బీఆర్‌ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు ఎద్దేవా చేశారు. స్థానిక తన నివాసంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఒక జాతీయస్థాయి నాయకుడు వస్తే కాటారంలో ఐదు నుంచి ఆరువేల మంది మాత్రమే కనిపించడాన్ని చూస్తే కాంగ్రెస్ పార్టీ చతికిలపడ్డట్లు అర్థం అవుతోందన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన వి.హనుమంతరావు, డి.శ్రీనివాస్‌లాంటి నాయకులు ముఖ్యమంత్రి దాకా వచ్చి వెనకకు నెట్టివేయబడ్డారని, పొన్నాల లక్ష్మయ్యకు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వని దుస్థితి కాంగ్రెస్‌ది అని అన్నారు. బీసీల లెక్కలు సీఎం కేసీఆర్ ఎప్పుడో ప్రకటించారని గుర్తుచేశారు. మంథని నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలించి, ప్రధానిగా దేశ ప్రజలకు సేవలు అందించిన దివంగత పీవీ నర్సింహారావు గురించి మంథనికి వచ్చిన రాహుల్‌గాంధీ ఒక్క మాటకూడా మాట్లాడకపోవడం విచారకరమన్నారు. బస్సుయాత్ర సందర్భంగా డబ్బులు, మందు, మాంసం పంపిణీ చేశారని ఆరోపించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమం సాధ్యం

- డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్



మధును పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీతో సంక్షేమ సర్కార్ ఏర్పడబోతోందన్నారు. రూ.2లక్షల వరకు రైతురుణ మాఫీ చేసేందుకు హామీ ఇచ్చామన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని ఆయన అన్నారు.

కాంగ్రెస్‌లో మాజీ ఎమ్మెల్యే తనయుడు

మాజీ ఎమ్మెల్యే మాలెం మల్లేశం కుమారుడు మాలెం మధు కాంగ్రెస్‌లో చేరారు. అయనకు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇస్సంపేటకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరగా రాజ్‌ఠాకూర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇందులో నాయకులు బరిపటి సాంబయ్య, చుక్కయ్య, బరిపాటి కిషన్, బరిపాటి రవి, బియ్యాల కొండపాటి, శ్రావణ్, చంద్రమోహన్, కందుల లడ్డు, నలువల రవి, బియ్యాల మల్లేశ్ తదితరులు ఉన్నారు.

దుర్గామాత వద్ద ప్రత్యేక పూజలు

జీడీకే-11గనిపై రాజ్‌ఠాకూర్ దుర్గామాతకు పూజలు చేశారు. నాయకులు కాల్వ లింగస్వామి, బొంతల రాజేశ్, పాతపెల్లి ఎల్లయ్య, బొమ్మక రాజేశ్, తాళ్లపెల్లి యుగేందర్, తిప్పారపు శ్రీనివాస్, కొప్పుల శంకర్, నాయిని ఓదెలు పాల్గొన్నారు. పలు యూత్‌లు ఏర్పాటు చేసిన దుర్గామాత వద్ద ఠాకూర్ పూజలు చేశారు.

స్వేచ్ఛాయుత ఎన్నికలు లక్ష్యం



రెమా రాజేశ్వరి

గోదావరిఖని: స్వేచ్ఛాయుత, శాంతియుత, పారదర్శక ఎన్నికల కోసం ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి శుక్రవారం పేర్కొన్నారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్, అటవీ, వాణిజ్య పన్నులు, రవాణా శాఖలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన ఈనెల 9నుంచి శుక్రవారం వరకు రూ.3,17,23,770.75 విలువైన బంగారం, వెండి, నగదు, మద్యం, బెల్లం, పటిక, గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటితోపాటు స్పీకర్లు, ఆంప్లిఫయర్లు, టీకుదుంగలు, చీరలు స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.2,89లక్షలు ఉంటుందన్నారు. 438 కేసుల్లో 1,393 మందిని 107 సీఆర్‌పీసీ, 110సీఆర్‌పీసీ, 151 సీఆర్‌పీసీ సెక్షన్ల కింద బైండోవర్ చేశామన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 35 మంది ఆయుధాల లైసెన్స్ కలిగిన వ్యక్తులు ఉన్నారని, వీరిలో 30 మంది ఆయా పోలీస్‌స్టేషన్లలో ఆయుధాలను డిపాజిట్ చేశారన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు, గ్రామాల్లో ఎన్నికలపై పోలీసు కళాబృందం ద్వారా ఓటుహక్కు గురించి వివరిస్తున్నామన్నారు. మంచిర్యాలజోన్ రాపనపల్లి వద్ద అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్ట్, అంతర్ జిల్లాల సరిహద్దుల వద్ద 9 చెక్ పోస్టులు ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటికే కేంద్ర పారా మిలటరీ బలగాలు(సీఏపీఎఫ్) వచ్చాయని తెలిపారు. సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నగదు, బంగారం, వెండి, విలువైన వస్తువులను తీసుకు వెళ్తే కచ్చితంగా ఆధారాలు వెంట తీసుకెళ్లాలని సూచించారు.

రైల్వే మొబైల్ టికెట్ల జారీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీటీఎస్‌ఆర్ జాఫరి

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ బుకింగ్ కౌంటర్ ప్రాంగణంలో మొబైల్ టికెటింగ్ ఇష్యూపై చీఫ్ కమర్షియల్ సూపర్‌వైజర్ జాఫరి శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రత్యేక యాప్ డౌన్‌లోడ్ చేసుకునే విధానం, దాసిసాయంతో సాధారణ టికెట్ పొందే విధానం తదితర అంశాలపై సెల్‌ఫోన్లలో వివరించారు. ఆధునిక పద్ధతి ద్వారా టికెట్ ధరపై 3శాతం కమీషన్ లభిస్తుందని, సమయం ఆదా అవుతుందని అన్నారు. కాగా, ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. వివరాలకు నంబరు 98492 96097ను సంప్రదించాలని సూచించారు. రైల్వే టీసీ మాడిశెట్టి శ్రీనివాస్, మాజీ డీఆర్‌యూసీసీ సభ్యుడు అనుమాస శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆస్తిపన్నుపై శ్రద్ధ చూపాలి

పెద్దపల్లిరూరల్: ఆస్తిపన్ను వసూళ్లలో వేగం పెంచాలని డీఎల్‌పీవో వేణుగోపాల్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ఆదివారం జరిగే బతుకమ్మ నిమజ్జనోత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. పారిశుధ్యం నిర్వహణపై దృష్టిసారించాలన్నారు. డ్రైనేజీల్లో నీరు నిల్వకుండా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీవోలు సుదర్శన్, అనిల్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి అర్జున్

పెద్దపల్లిరూరల్: సమాజంలోని ప్రతీపౌరుడికి హక్కులపై అవగాహన అవసరమని, ఇతరుల హక్కులకు భంగం కలుగకుండా చూడాలని సీనియర్ సివిల్‌జడ్జి అర్జున్ అన్నారు. రాగినేడులో శుక్రవారం న్యాయవిజ్ఞానసదస్సు నిర్వహించారు. చట్టాలపై ప్రతీ ఒక్కరు కనీస అవగాహన పెంచుకోవాలన్నారు. పేదలు ఉచిత న్యాయం సేవలను పొందేందుకు అవకాశం ఉందని ఆయన అన్నారు. ట్రాక్టర్, ఆటోలకు బీమా చేయించుకోవాలని సూచించారు. అనుకోకుండా ప్రమాదాలు జరిగినపుడు బీమా సొమ్ము ఆసరాగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్క రేవతితోపాటు న్యాయవాదులు శ్రీనివాస్, ఠాకూర్ హన్మాన్‌సింగ్, శంకరయ్య, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యేలు



ఇంద్రసేనారెడ్డితో గుజ్జుల, ధర్మారావు

పెద్దపల్లిరూరల్: త్రిపుర గవర్నర్‌గా నియమితులైన నల్లు ఇంద్రాసేనారెడ్డిని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, హన్మకొండ మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు వారు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఖనికి మందకృష్ణ మాదిగ



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ శనివారం గోదావరిఖనిలో పర్యటించనున్నారు. స్థానిక శ్రీలక్ష్మి ఫంక్షన్‌హాల్‌లో జరిగే సదస్సులో ఆయన పాల్గొంటారని నియోజకవర్గ ఇన్‌చార్జి మంద రవికుమార్ శుక్రవారం తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని రవికుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాడి మస్తాన్, కాసిపేట రాజయ్య, జలంపల్లి శ్రీనివాస్, కల్వల శేఖర్, పొన్నాల నవీన్, శ్యామ్, అజయ్, కళ్యాణ్, సృజన, వివేక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి కన్నుమూత



నర్సమ్మ(ఫైల్)

రామగుండం: అంతర్గాం మండలం ఎల్లంపల్లికి చెందిన ఆరుముళ్ల నర్సమ్మ(106) శుక్రవారం వయోభారంతో బాధపడుతూ కన్నుమూశారు. గోదావరి నదిపై రైలువంతెన నిర్మించిన సమయంలో తన వయస్సు ఆరేళ్లు అని తనకూతురు పుష్పలత ఇంట్లో ఇటీవల జరిగిన శుభకార్యానికి హాజరైన సందర్భంగా వృద్ధురాలు తెలిపారు. ఇప్పటిదాకా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న వృద్ధురాలు.. వయోభారంతో మృతిచెందడంపై గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె భర్త పోశయ్య 50 ఏళ్ల క్రితమే మృతిచెందాడు. వారికి ఒకేఒక కూతురు ఉంది.

వేతనాలు రావు.. పనుల్లేవు!

● ధర్మాస్పత్రిలో దోభీ కష్టాలు



థియేటర్‌లో పేరుకుపోయిన బట్టలు, బెడ్‌షీట్లు



ఆస్పత్రి ఆవరణలోని దోభీ షెడ్డు

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో దోభీ సేవలు నిలిచిపోయాయి. సిబ్బందికి వేతనాలు రాకపోవడం, కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి రెండేళ్లుగా బిల్లులు మంజూరు కాకపోవడంతో సిబ్బంది విధులు బహిష్కరించారు. దీంతో ఆపరేషన్ థియేటర్‌లోని బట్టలతోపాటు బెడ్‌షీట్లు పేరుకుపోతున్నాయి. అధికారులు ప్రత్యామ్నాయంగా శానిటేషన్ సిబ్బందిపై ఒత్తిడి తెచ్చి బట్టలు ఉతికిస్తున్నారు. దీనిపై దోభీ సిబ్బంది తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు తమ గోడు వెళ్లబోసుకున్నారు.

2018లో దోభీ సేవలకు టెండరు..

- జీజీహెచ్‌లో దోభీ సేవల కోసం హైదరాబాద్‌కు చెందిన శ్రీచాణక్య ఎంటర్ ప్రైజెస్ సంస్థకు ప్రభుత్వం 2018లో టెండరు ద్వారా పనులు అప్పగించింది.
- ఈ పనుల కోసం ఆ సంస్థ ఆధునిక యంత్రాలను కొనుగోలు చేసి బిగించింది.
- ఇందుకోసం ఎన్టీపీసీ సంస్థ నిర్మించిన దోభీ షెడ్డులో కొంతమంది సిబ్బందిని నియమించి సేవలు ప్రారంభించింది.

బిల్లుల మంజూరులో ఆలస్యం..

కాంట్రాక్టు సంస్థకు రెండేళ్లుగా ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కావడం లేదు. దీనికితోడు మరో ఏడాది చేసిన పనులకు కూడా ఆస్పత్రి అధికారులు బిల్లులు రాయడం లేదని కాంట్రాక్టర్ తెలిపారు. బిల్లులు మంజూరు కాకపోవడంతో ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొందని అంటున్నారు.

నిలిచిన దోభీ సేవలు..

- కాంట్రాక్టర్ వేతనాలు ఇవ్వక సిబ్బంది 15రోజులుగా విధులు బహిష్కరిస్తున్నారు.
- ఇటీవల దోభీ పనులు నిర్వహించడానికి నలుగురు సిబ్బంది అవసరం ఉందని వారధి ద్వారా నోటిఫికేషన్ జారీచేశారు.
- ఇందులో దోభీ పనులు నిర్వహిస్తున్న సిబ్బంది కూడా దరఖాస్తు చేసుకున్నారు.
- తమను వారధి ద్వారా నియమించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పేరుకుపోతున్న దుస్తులు..

- 15 రోజులుగా దోభీ కార్మికులు పనులు చేయకపోవడంతో ఆస్పత్రిలో దోభీ సేవలకు అంతరాయం కలుగుతోంది. ప్రధానంగా ఆపరేషన్ థియేటర్‌లో ఉపయోగించే బట్టలు, బెట్‌షీట్లు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. ఏరోజుకు ఆరోజు వీటిని ఉతకాల్సి ఉంది. కానీ సిబ్బంది లేక మూటలుగా కట్టి మూలన పడేస్తున్నారు.

శానిటేషన్ సిబ్బందితో పనులు..

- పేరుకుపోతున్న బట్టలను శానిటేషన్‌లో విభాగంలోని సిబ్బందితో అధికారులు ఉతికేలా ఒత్తిడి చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల ఇదే తరహాలో బట్టల ఉతకాలని అధికారులు ఆదేశించడంతో వ్యతిరేకించిన కార్మికులు.. దోభీ పనులు చేయబోమని నిరాకరించారు. దోభీ కార్మికులు చేయాల్సిన పనులను శానిటేషన్ సిబ్బందితో చేయించడం సరికాదని కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విధుల్లోకి తీసుకోవాలని వినతి

గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో వేతనాలు రాక, విధులకు హాజరుకాని దోభీ సిబ్బందిని వారధి ద్వారా పనుల్లోకి తీసుకోవాలని ప్రతినిధులు కనుకయ్య, చంద్రయ్య, బాలయ్య, మంజు డిమాండ్ చేశారు. శుక్రవారం జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆరేళ్లుగా చాణక్య ఏజెన్సీ ద్వారా దోభీ పనులు చేస్తున్నామని, గతనెల 20న దాని గడువు ముగిసిందని అన్నారు. అయినా ఈనెల 10వరకు బట్టలు ఉతికినట్లు వెల్లడించారు. అయితే, వారధి ద్వారా కొత్త వాళ్లను పనిలోకి తీసుకోవడానికి నోటిఫికేషన్ జారీచేశారని, ఇందులో కూడా మేం దరఖాస్తు చేసుకున్నామని, తమను వారధి ద్వారా పనుల్లోకి తీసుకోవాలని కోరారు.

ప్రత్యామ్నాయ చర్యలే



దోభీ సిబ్బంది పనులు చేయకపోవడంతో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నాం. ఆపరేషన్ నిర్వహించిన సమయంలో రక్తంతో తడిసిన బట్టలు, వార్డుల్లోని బెడ్‌షీట్లను ప్రతిరోజూ ఉతకాలి. ఈ విషయంపై మెడికల్ సూపరింటెండెంట్, కాలేజీ ప్రిన్సిపాల్ కలిసి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కలెక్టర్ సూచనలు, ఆదేశాలతో చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ అరుణ, ఆర్ఎంవో, జీజీహెచ్

వ్యతిరేకిస్తున్నాం



దోభీ సిబ్బందితో కాకుండా శానిటేషన్ కార్మికులతో బట్టలు ఉతికించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. దోభీ సిబ్బంది, శానిటేషన్ కార్మికులకు అండగా ఉంటాం. వారిజీవనోపాధికి భంగం కలిగించకుండా అధికారులు స్పందించాలి. వారధి ద్వారా దోభీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

– కదారి సునీల్, జిల్లా జనరల్ సెక్రటరీ, ఏఐటీయూసీ

గాజాపై సైనిక దాడులు తక్షణమే నిలిపివేయాలి



ఖనిలో నిరసన ప్రదర్శన



యైటింక్లయిన్‌కాలనీలో..

గోదావరిఖని: గాజాపై ఇజ్రాయిల్ దాడులు తక్షణమే నిలిపివేయాలని కోరుతూ శుక్రవారం స్థానిక పైలాన్‌వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఇ.నరేశ్ మాట్లాడుతూ ఇజ్రాయిల్‌పై హమాస్ దాడిని అడ్డుపెట్టుకొని గాజా, పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సైనిక దాడులు చేయడం గర్హనీయమన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూదులు పాలిస్తీనాకు వలసవచ్చారని, ఆశ్రయం కల్పించిన పాలస్తీనా ప్రజలపైనే వారు యుద్ధం ప్రకటించారన్నారు. తమకు ఒకదేశం కావాలని పాలిస్తీనా ప్రజలపై పోరాడి, ఐక్యరాజ్యసమితి, అమెరికా అండతో ఇజ్రాయిల్‌ను సాధించుకున్నారని, ఐక్యరాజ్యసమితి 60 శాతం భూభాగాన్ని కేటాయిస్తే నేడు 90 శాతం ఆక్రమించారని నరేశ్ విమర్శించారు. ఇజ్రాయిల్ దురాక్రమణకు వ్యతిరేకంగా ప్రజలు దశాబ్దాలుగా పోరాడుతూనే ఉన్నారని గుర్తుచేశారు. అమెరికా సామ్రాజ్యవాద అండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న దురాగాతాలకు అంతులేదన్నారు. నాయకులు ఎం.దుర్గయ్య, బాబు, టి.రాంకీ, కె.మల్లేశం, మర్రి శ్రావణ్, శ్రీకాంత్, వెంకటేశ్, శ్రీనివాస్, లింగయ్య, తిరుపతి, అఫ్జల్, ఆర్.సురేశ్ పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడికి నిరసన

యైటింక్లయిన్‌కాలనీ: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. పార్టీ మంథని డివిజన్ కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రపంచ శాంతికోసం ఇజ్రాయిల్ యుద్ధాన్ని విరమించేలా ఐక్యరాజ్య సమితిపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు రాజేశ్వరి, మధునమ్మ, లింగయ్య, నాగరాజు, రజిత, రాణి, ప్రకాశ్, రాయమల్లు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానవంతులతోనే విధానపరమైన నిర్ణయాలు



మాట్లాడుతున్న సుహాసిని

రామగుండం: విజ్ఞానవంతులవుతోనే విధానపరమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ మాజీ ఆఫీసర్(ఆర్‌జేడీ–ఎఫ్ఏసీ) లంక సుహాసిని అన్నారు. అంతర్గాం ప్రెస్‌భవన్‌లో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా రామగుండం అసెంబ్లీ నుంచి పోటీ చేస్తానన్నారు. తాను 12ఏళ్లపాటు గోదావరిఖని కళాశాల ప్రిన్సిపాల్‌గా సేవలు అందించానని, ఈక్రమంలో యువతీయువకులు, మహిళలు, పరిస్థితులపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. తన శేష జీవితంలో ప్రజలకు మెరుగైన సేవ చేయాలనే తపనతో ప్రజాక్షేత్రంలోకి అడుగు పెడుతున్నానని, నియోజకవర్గ ప్రజలు ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో శ్రీకాంత్, నిఖిల్, అనిల్, రాహుల్, నాగు, వెంకటేశ్, సూరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ–2లో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

గోదావరిఖని: ఆర్జీ–2లోని యైటింక్లయిన్ కాలనీస సీఈఆర్ క్లబ్‌లో శుక్రవారం రాత్రి బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. జీఎం ఎల్వీ సూర్యనారాయణ, సేవా అధ్యక్షురాలు మాలతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని బతుకమ్మ ఆడారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి

యైటింక్లయిన్‌కాలనీ: విద్యుత్ బకాయిలు ఉన్నవారు వెంటనే చెల్లించాలని డీఈ శివరామ్ సూచించారు. శుక్రవారం రామగుండం కార్పొరేషన్ న్యూమారేడుపాక, యైటింక్లయిన్‌కాలనీ, అల్లూరుపోచమ్మవాడ తదితర ఏరియాల్లో ఏఏఓ రఘుపతిరెడ్డి, ఏఈ హరీశ్, ఎల్ఐవో రావు, జేఎల్ఎం తిరుపతి, సిబ్బందితో పర్యటించారు. బకాయిలతోపాటు అక్రమ విద్యుత్ కనెక్షన్లు తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. విద్యుత్ సిబ్బంది శివసంతోష్, స్వామి, తిరుపతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో మర్చిపోలేని ఘటన



రాహుల్ పక్కనే పెండ్యాల మహేశ్

రామగుండం: జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ సభావేదికపై తాను ఆశీనులు కావడం, ఆయన పక్కనే కూర్చునే అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి అవకాశం వస్తుందని ఏనాడూ ఊహించుకోలేదన్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి, బీసీ జనగణనపై రాహుల్ ప్రత్యేక దృష్టి సారించారని ఆయన పేర్కొన్నారు.

ఎంబీఏ ఫలితాల్లో ట్రినిటి హవా



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ట్రినిటి కాలేజీ విద్యార్థులు ఎంబీఏలో ఉత్తమ ఫలితాలతో రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు. రెండో సెమిస్టర్ ఫలితాల్లో ఆశ 8.56పాయింట్లు, ముస్కాన్ 8.41 పాయింట్లు, శిరీష, భవాని, శరణ్య 8.30 పాయింట్లు సాధించారని అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్ శుక్రవారం తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ మణిగణేశన్ తదితరులు అభినందించారు.

కార్మికుడికి గాయాలు

రామగిరి: ఆర్జీ–3 డివిజన్‌లోని ఏపీఏ గనిలో శుక్రవారం జనరల్ షిఫ్ట్‌లో జరిగిన ప్రమాదంలో సింగరేణి కార్మికుడు బానోతు నరేశ్ గాయపడ్డాడు. 91 లెవల్ ఏఎం 100 పనిస్థలంలో హెయిర్ డక్కులు కడుతుండగా అవి జారి నరేశ్‌పై పడ్డాయి. దీంతో మెడ వద్ద తీవ్రగాయాలు కావడంతో వెంటనే గోదావరిఖని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని మరో ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా, హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్.. గాయపడ్డ కార్మికుడు నరేశ్‌ను పరామర్శించారు. అనుభవంలేని బదిలీ వర్కర్లతో విధులు చేయించడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని రియాజ్ అహ్మద్ ఆరోపించారు. కార్యక్రమంలో ఏపీఏ వైస్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వర్, పిట్ సెక్రటరీ రంజిత్‌కుమార్, బ్రాంచ్ జాయింట్ సెక్రటరీ మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

స్క్రాప్ స్వాధీనం

గోదావరిఖని: చోరీకి గురైన ఐరన్‌స్క్రాప్‌ను ఆర్జీ–1 సెక్యూరిటీ సిబ్బంది శుక్రవారం పట్టుకున్నారు. జీడీకే–5 ఓసీపీలో ఈనెల 19న స్క్రాప్ చోరీకి గురికాగా, విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక విఠల్‌నగర్ స్క్రాప్‌షాప్‌పై ఆకస్మికంగా దాడి చేశారు. చోరీకి గురైన 11ఐరన్ చానెల్స్, 1గార్డర్, రెండు యాంగ్లర్‌లు షాపులో పట్టుబడినట్లు సిబ్బంది పేర్కొన్నారు. ఈమేరకు వాటిని స్వాధీనం చేసుకుని జీఎం కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌వో వీరారెడ్డి, జూనియర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ ఉమేశ్, చంద శ్రీనివాస్, సిబ్బంది ఓదెలు, రాధాకృష్ణ, తిరుపతి, ప్రవేట్ సూపర్‌వైజర్ ఓదెలు పాల్గొన్నారు.

పూర్వవైభవం తీసుకొస్తా

● మక్కాన్‌సింగ్‌ఠాకూర్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు ఠాకూర్

రామగుండం: పట్టణానికి పూర్వ వైభవం తీసుకువస్తానని, కాలం చెల్లిన బీ థర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో కొత్త ప్రాజెక్టు సాధిస్తామని రామగుండం అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. రామునిగుండాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని, నళిని విలాస్ నుంచి శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయం వరకు భూగర్భ డ్రైనేజీ నిర్మిస్తామని, పెద్దచెరువును ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో సీనియర్ నాయకుడు అయోధ్యసింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన వందలాది మంది కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అనంతరం బందారపు బుగ్గ రాములుగౌడ్, తెలంగాణ ఉద్యమకారుడు ఖమర్ భక్త్, దాసరి ఓదెలు, నాగబోయిన చంద్రయ్య, సిరికొండ కోటి తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

'బీఆర్ఎస్‌ది అరాచక పాలన'



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో..

పెద్దపల్లిరూరల్: బీఆర్ఎస్ అరాచక పాలనపై విసుగుచెందిన ప్రజలు ఆ సర్కారును అంతమొందించేందుకు సన్నద్ధంగా ఉన్నారని మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్‌కు చెందిన సింగిల్‌విండో చైర్మన్ వేణుగోపాల్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొగుసాల సరోత్తంరెడ్డితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ప్రజాసంక్షేమాన్ని విస్మరించి, సహజ సంపదలను దోచుకోవడం, ఆస్తులను కూడబెట్టుకోవడంపైనే దృష్టి సారించారని ఆరోపించారు. ఈసారి జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ భూస్థాపితం కావడం ఖాయమని అన్నారు. నాయకులు సారయ్య, గంట రమేశ్, ముడుసు సాంబిరెడ్డి, ప్రేంసాగర్‌రెడ్డి, వరప్రసాద్, రాజేశ్వర్‌రెడ్డి, సంజీవ్, మహేందర్, పెద్ది కుమార్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంథనిలో బీజేపీ బలం పుంజుకుంది

● కర్ణాటక ఎమ్మెల్సీ కేశవ్ ప్రసాద్



మాట్లాడుతున్న కేశవ ప్రసాద్

మంథని: మంథని నియోజకవర్గంలో బీజేపీ గతకంటే మెరుగైందని, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తే ఇక్కడ విజయం మనదేనని కర్ణాటక ఎమ్మెల్సీ కేశవ్ ప్రసాద్, పార్లమెంటరీ కన్వీనర్ మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు అవినీతి బీఆర్ఎస్, అసమర్థ కాంగ్రెస్ పార్టీలను వ్యతిరేకిస్తున్నారని, ఈసారి బీజేపీ పట్టం కట్టాలని భావిస్తున్నారని అన్నారు. ప్రతీకార్యకర్త కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సామాన్య ప్రజలకు క్లుప్తంగా వివరించి బీజేపీని గెలిపించాలన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచెర్ల గ్రామానికి చెందిన పలువురు మహిళలు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్‌రావు, కో కన్వీనర్ నాంపల్లి రమేశ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండపాక సత్య ప్రకాశ్, జిల్లా అధికార ప్రతినిధి పోతరవేణి క్రాంతికుమార్, నాయకులు ఉడుముల విజయరెడ్డి, వీరబోయిన రాజేందర్, పెయ్యాల కుమార్, జంగపల్లి అజయ్, ముడతనపల్లి ప్రభాకర్, బొమ్మన భాస్కర్‌రెడ్డి, పిలుమారి సంపత్, సిరిపురం శ్రీమన్నారాయణ, కోయల్కార్ నిరంజన్, బూడిద తిరుపతి పాల్గొన్నారు.

బొగ్గు బాయి

ప్రాజెక్ట్, ప్లానింగ్ డైరెక్టర్ వీడియోకాన్ఫరెన్స్



మాట్లాడుతున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్జీ–1 అధికారులతో మాట్లాడారు. మేడిపల్లి ఓసీపీ మైన్‌క్లోజర్ ప్లాన్‌కు సంబంధించి అన్ని ఏరియాల అధికారులతో సమీక్షించారు. దీనిలో భాగాంగా మేడిపల్లి ఓపెన్ కాస్ట్ ఫైనల్ క్లోజర్, పర్యావరణ రెమిడేషన్ ప్లాన్స్‌కు సంబంధించి, సంక్షేమ కార్యక్రమాల గురించి చర్చించారు. ప్రభావిత గ్రామాల్లో చేపట్టాల్సిన సీసీరోడ్లు, మరమతులు, ఆర్‌డబ్ల్యూహెచ్ పిట్స్, వర్షం నీటికి సంబంధించిన హార్వెస్ట్ పిట్, టాయిలెట్స్ నిర్మాణాలు, సోలార్ వీధిదీపాలు, మొక్క పెంపకంపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఏజెంట్ బానోతు సైదులు, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, నాగేశ్వర్‌రావు, ఆంజనేయులు, మేనేజర్ మల్లికార్జున్ యాదవ్ పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

● సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు



యంత్రాలు ప్రారంభిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణరావు

గోదావరిఖని: కార్మికుల సంక్షేమంలో వెనకడుగువేసే ప్రసక్తేలేదని సింగరేణి ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో రూ.50లక్షల వ్యయంతో అనెస్తిషియా వర్క్‌స్టేషన్, రూ.25లక్షలతో వ్యయంతో కొనుగోలు చేసిన 2డీ ఇకో కలర్ డాప్లర్ యంత్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రామగుండం ఏరియా హాస్పిటల్‌లో కార్మిక కుటుంబాలకు వైద్య సదుపాయాలు కల్పించేందుకు ఖర్చుకు వెనుకాడకుండా నూతన యంత్రాలను కొనుగోలు చేస్తున్నామన్నారు. అనంతరం బయోకెమిస్ట్రీ అనాలసిస్, మైక్రో బయోలజీ రక్తశుద్ధి కంప్యూటర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఏరియా ఇంజినీరు రామమూర్తి, ఏరియా వర్క్‌షాప్ డీజీఎం మదన్‌మోహన్, డీవైసీఎంవో కిరణ్‌రాజ్‌కుమార్, డాక్టర్ మద్దిలేటి, హెల్త్ ఆఫీసర్ సుమన్, వైద్యులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

గోదావరిఖని: ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. సేవాసమితి అధ్యక్షురాలు చింతల లక్ష్మి, ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై పూజలు చేసి వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో ధనలక్ష్మీబాయి, మాధవి, లేడీస్ క్లబ్ సభ్యులు చిలుక లక్ష్మి, నీరజ, బీనాసింగ్, ఎస్‌వోటూ జీఎం రాంమోహన్, పర్సనల్ జీఎం లక్ష్మీనారాయణ, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డి



నియామకపత్రం అందుకుంటున్న సత్యనారాయణరెడ్డి

గోదావరిఖని: ఆర్జీ–2 ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడిగా కొత్త సత్యనారాయణరెడ్డిని నియమించారు. ఈమేరకు యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ నియామకపత్రం అందజేశారు. జనక్‌ప్రసాద్ మాట్లాడుతూ ఆర్జీ–2 ఏరియాలో సింగరేణి కార్మికులకు అండగా ఉండి పోరాడాలన్నారు. రాబోయే యూనియన్ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

దుర్గామాతకు పూజలు



డైరెక్టర్‌ను సన్మానిస్తున్న శ్రీనివాస్

గోదావరిఖని: శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం జీడీకే–11గనిపై ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింగరేణి ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డైరెక్టర్‌ను ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ రాంమూర్తి శాలువాతో సన్మానించారు. ఏరియా వర్క్‌షాప్ డీజీఎం మదన్‌మోహన్, గని ఏజెంట్ చిలక శ్రీనివాస్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్ ఉన్నారు.